క్లుప్తంగా

డంపింగ్ యార్డు పరిశీలన



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న డీపీవో వెంకటేశ్వరరావు

తాండూర్: తాండూర్ గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు, వైకుంఠ ధామం, నర్సరీని, శానిటేషన్ పనులను డీపీవో వెంకటేశ్వరరావు పరిశీలించారు. డంపింగ్ యార్డులో చెత్తాచెదారం, ప్లాస్టిక్, గ్లాస్, పేపర్, ఇనుము వేరు చేయాలని, వైకుంఠధామంలో పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు లేకుండా శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. తాండూర్‌లో పారిశుధ్య పనులు సత్వరంగా పూర్తి చేయాలన్నారు. నర్సరీలో పెంచుతున్న మొక్కలను షిఫ్టింగ్ గ్రేడింగ్ చేయాలన్నారు. సర్పంచ్ నవీన్‌కుమార్, డీపీఎం నరేందర్, ఎంపీవో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి తఫాస్ ఉన్నారు.

డీఈవోకు సన్మానం

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల జిల్లా నూతన విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన యాదయ్యను ఉపాధ్యాయ సంఘాల నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలుసుకుని శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా విద్యాశాఖలో ఉన్న సమస్యలు, ప్రగతి, టెన్త్ ఫలితాలపై చర్చించారు. సీపీఎస్ ఉపాధ్యాయ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమలాకర్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజన్న, ప్రధాన కార్యదర్శి రాజనర్సు, జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు, పేట సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజయ్య గోపాల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యమిత్రుడి కుటుంబానికి అండ



ఆర్థికసాయం అందిస్తున్న మిత్రులు

దండేపల్లి: తమతో కలిసి చదువుకుని అనారోగ్యంతో చనిపోయిన బాల్యమిత్రుడి కుటుంబానికి మిత్రులు అండగా నిలిచారు. మండలంలోని బిక్కనగూడకు చెందిన దశముకి రేణయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో అతనితో ద్వారక జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1993 ఎస్సెస్సీ బ్యాచ్ మిత్రులు అతని కుటుంబానికి రూ.15వేల ఆర్థికసాయం, 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను శుక్రవారం అందజేశారు. మిత్రులు రవి, రెడ్డి, చంద్రమౌళి, మూర్తి, గోపాల్, నృపేందర్, ప్రభాకర్, నర్సింగం, మల్లేశ్ పాల్గొన్నారు.

అంబలి కేంద్రం ప్రారంభం



కేంద్రం వద్ద రామ్మోహన్‌రావు, నాయకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల కేంద్రంలో పూస్కూరు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత అంబలి పంపిణీ కేంద్రాన్ని తెలంగాణ ఫిలిం బోర్డు కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూస్కూరు రామ్మోహన్‌రావు శుక్రవారం ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీరుస్తూ వడదెబ్బకు తగలకుండా ఈ అంబలి ఆరోగ్యకరమైందని అన్నారు. రైతుబంధు మండల కన్వీనర్ పూస్కూరు శ్రీనివాసరావు, బీఆర్ఎస్ నాయకులు సంజయ్‌రావు, దొమ్మటి సత్తయ్య, బొడ్డు శంకర్, సింగతి మురళి, పూదరి శంకరయ్య, స్థానికులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న భక్తులు

రామకృష్ణాపూర్: పట్టణంలోని ఏజోన్ రామాలయంలో గల అభయాంజనేయస్వామి ఆలయ 17వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పంచామృతాభిషేకం, చందనపూజ, పంచసూక్త రుద్రహోమం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

అడుగడుగునా నిఘా నేత్రం

- అసాంఘిక శక్తులు, ఆకతాయిల ఆటకట్టు
- చెన్నూర్‌లో కొత్తగా 100 సీసీ కెమెరాల ఏర్పాటు
- త్వరలో ప్రభుత్వ విప్, సీపీలతో ప్రారంభం

చెన్నూర్: నేరాల నియంత్రణే లక్ష్యంగా పోలీసులు ముందుకు సాగుతున్నారు. అసాంఘిక శక్తులు, ఆకతాయిలకు కళ్లెం వేసేందుకు చెన్నూర్ మున్సిపాలిటీలో అడుగడుగునా నిఘా నేత్రాలు ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్లతోపాటు జాతీయ రహదారి, కాలనీల్లో సీసీ కెమెరాలు బిగించారు. చోరీలు, ప్రమాదాలు, ఆకతాయిల ఆగడాలను వెంటనే కనిపెట్టేందుకు సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషించనున్నాయి. గతనెల రోజులుగా చెన్నూర్ మున్సిపాలిటీలో చోరీలు జరుగుతున్నాయి. కాలనీల్లో సీసీ కెమెరాలు లేకపోవడంతో చోరీలు ఛేదించడంలో పోలీసులు తలమునకలవుతున్నారు. గతంలో ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన సీసీ సక్రమంగా పనిచేయకపోవడంతో పోలీసులకు తలనొప్పిగా మారింది. దీంతో ప్రజల భాగస్వామ్యంతో పోలీసులు మున్సిపాలిటీ పరిధిలో 100 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. వీటిని త్వరలో ప్రభుత్వ విప్ బాల్కసుమన్, సీపీ రెమా రాజేశ్వరిలతో ప్రారంభించనున్నారు.

ఒక్క సీసీ కెమెరా వంద మందితో సమానం

ఒక్క సీసీ కెమెరా వంద మంది నిఘాతో సమానంగా పని చేస్తుంది. గతేడాది చెన్నూర్‌లోని ఎస్‌బీఐ ఏటీఎంలో రాత్రి ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇరువురు చోరీకి పాల్పడ్డారు. సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు దొంగలను గుర్తించారు. తెల్లవారుజాము చోరీకి చేసిన దొంగలు స్వగ్రామం వెళ్లేందుకు చెన్నూర్ బస్టాండ్‌లో సంచరిస్తుండగా పోలీసులు వారిని పట్టుకున్నారు.

మున్సిపాలిటీలో..

మున్సిపాలిటీ పరిధిలోని జాతీయ రహదారితో పాటు హైవేకు ఉన్న రెండు పెట్రోల్ బంక్‌లు, మినీ ట్యాంక్‌బండ్, జెండావాడ, లంబడిపల్లి రోడ్డు, పద్మనగర్, పంచముఖాంజనేయ ఆలయం, ఆదర్శనగర్, మారెమ్మవాడ, గోదావరి రోడ్డుతోపాటు అన్ని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. పట్టణానికి అపరిచితులు ఎటు నుంచి వచ్చి తిరిగివెళ్లిన వారిని గుర్తించేలా పోలీసులు కార్నర్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు.



చెన్నూర్ మినీ ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

త్వరలో ప్రారంభం



ప్రధాన కూడళ్లతో పాటు పట్టణ పొలిమేరతోపాటు కాలనీల్లో 100 కెమెరాలు ఏర్పాటు చేయించాం. త్వరలో నూతనంగా ఏర్పాటు చేసిన కెమెరాలను ప్రభుత్వ విప్ బాల్క సుమన్, రామగుండం సీపీ రెమా రాజేశ్వరితో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. – వాసుదేవరావు, సీఐ చెన్నూర్

శరవేగంగా సీసీ కెమెరాల ఏర్పాటు

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. కొన్నాళ్ల క్రితం ముఖ్యమైన కూడళ్లలో బిగించిన నిఘా నేత్రాలు ప్రస్తుతం వినియోగంలో లేకుండా పోవడంతో వాటి స్థానంలో కొత్తగా మళ్లీ ఏర్పాటు చేస్తున్నారు. బజారుఏరియా ప్రాంతం, బస్తీల్లో పోలీసుల పర్యవేక్షణలో సీసీ కెమెరాలను ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నారు. మున్సిపల్ వ్యాప్తంగా దాదాపు 300 పైచిలుకు కెమెరాలు బిగించడానికి చర్యలు తీసుకుంటున్నారు. మున్సిపాలిటీలో 34 వార్డులు ఉన్నాయి. ఒక్కో వార్డు పరిధిలో 1,2 బస్తీలు కలబోసి ఉన్నాయి. బస్తీల్లో ఇటీవల దొంగతనాలు పెరుగుతున్నాయి. మరోపక్క బెల్లంపల్లి మావోయిస్టు, సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస) ప్రభావిత ప్రాంతం కావడంతో అనుమానితుల సంచారంపై నిఘా పెట్టడం, రోడ్డు ప్రమాదాలు జరుగుతుండటంతో ప్రమాదానికి కారకులైన వ్యక్తులు, దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను తేలికగా గుర్తించడానికి సీసీ కెమెరాలు ఉపయోగనున్నాయి.

ప్రజల భాగస్వామ్యంతో..

ప్రజాప్రతినిధులు, వ్యాపార, వాణిజ్యవర్గాలు, ప్రజలతో మమేకమై స్వచ్ఛందంగా ముందుకొచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. దుకాణాల సముదాయాలు, కూడళ్ల వద్ద, బస్తీల్లో కెమెరాల ఏర్పాటుకు ప్రజలు సహకరిస్తున్నారు. ఈ విషయమై వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ టి.శంకరయ్యను 'సాక్షి' వివరణ కోరగా నేరాలను కట్టడి చేయడానికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తున్నామన్నారు.

నిఘా నీడలో గ్రామాలు

భీమిని: కన్నెపల్లి మండలంలోని గ్రామాలు నిఘా నీడలో ఉన్నాయి. రామగుండం సీపీ రెమారాజేశ్వరి ఆదేశాల మేరకు ఎస్సై నరేశ్.. గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారుల సహకారంతో గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. మండలంలోని గొల్లగట్టు, జజ్జరవెల్లి, జన్కాపూర్, కన్నెపల్లి, లింగాల, మాడవెల్లి, మెట్‌పల్లి, నాయకునిపేట, పోలంపల్లి, ముత్తాపూర్, సాలిగాం, సుర్జాపూర్, టేకులపల్లి, వీరాపూర్, రెబ్బెనతోపాటు చింతపుడి, ఎల్లారం ఆమ్లేట్ విలేజీల్లో సైతం 50 సీసీ కెమెరాలకు పైగా ఏర్పాటు చేశారు. కన్నెపల్లి మండలంలో వందశాతం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినందుకు గురువారం ఎస్సై నరేశ్‌కు సీపీ రెమా రాజేశ్వరి, డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్‌లు ప్రశంసాపత్రం ఇచ్చి అభినందించారు.

ప్రజల భద్రత కోసం

ప్రజల భద్రత కోసమే గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. వీటి ఏర్పాటుకు ప్రజలు, వ్యాపారులు సహకరించారు. నేరాల నియంత్రణకు ఈ సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడనున్నాయి.

– నరేశ్, కన్నెపల్లి ఎస్సై



ప్రశంసాపత్రం అందుకుంటున్న కన్నెపల్లి ఎస్సై నరేశ్

ఇంటర్ స్టేట్ ర్యాంకర్‌కు సన్మానం



హరితను సన్మానించి స్వీట్ తినిపిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ముఖేష్ గౌడ్

మంచిర్యాలటౌన్: మందమర్రి మహాత్మా జ్యోతిబాపూలే గురుకులం విద్యార్థిని హరిత ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా ఆమెను మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేశ్‌గౌడ్ శుక్రవారం సన్మానించారు. జిల్లా కేంద్రంలోని జన్మభూమినగర్‌లో ఉంటున్న శ్రీరాముల వెంకటేశ్, రాజేశ్వరి దంపతుల కుమార్తె హరిత ఎంపీసీ ఇంటర్‌లో 470కి గాను 468 మార్కులు సాధించినందుకు విద్యార్థినిని కొనియాడారు. తండ్రి వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. కూతురు స్టేట్ ర్యాంక్ సాధించినందుకు కార్మెల్ కాన్వెంట్ స్కూల్ 1992వ సంవత్సరం టెన్త్ బ్యాచ్‌కు చెందిన సభ్యుల ద్వారా ఆర్థికంగా అన్ని విధాలుగా సహకారం అందిస్తామని ముఖేశ్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో బోరిగం రాజారాం, గజెల్లి వెంకన్న, తొగరు సుధాకర్, నరెడ్ల శ్రీనివాస్, గుర్రాల శ్రీనివాస్, మాటేటి శ్రీనివాస్, మొగిలి తిరుపతి, అంగన్‌వాడీ టీచర్ విజయ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ ఆర్థికసాయం

ఇంటర్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన హరితను జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ సన్మానించారు. రూ. 5 వేల ఆర్థికసాయం అందించారు.

ఇంటింటా ఇళ్ల పట్టాల పంపిణీ

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధి 22 వార్డులో శుక్రవారం ఇంటింటా ఇళ్ల పట్టాల పంపిణీ జరిగింది. దరఖాస్తు చేసుకున్న పలువురి లబ్ధిదారుల ఇళ్లకు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య స్వయంగా వెళ్లి ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంటికి పట్టా ఇచ్చి యాజమాన్యపు హక్కు కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఏళ్ల తరబడిగా ఎదురుచూస్తున్న ఇళ్ల పట్టాలతో పురప్రజలు ఇకపై స్వేచ్ఛాయుతంగా జీవించడానికి అవకాశం కలిగిందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వార్డు కౌన్సిలర్ గడ్డం అశోక్, బీఆర్ఎస్ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బూడిదగడ్డ బస్తీలో ఇంటి పట్టాను అందిస్తున్న ఎమ్మెల్యే

పట్టణ అభివృద్ధికి నిధులు తేవడంలో విఫలం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

మంచిర్యాలటౌన్: పట్టణ అభివృద్ధికి సరిపడా నిధులు తేవడంలో ఎమ్మెల్యే దివాకర్‌రావు విఫలం చెందారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి విమర్శించారు. గడప గడపకూ బీజేపీ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని 4వ వార్డు శ్రీశ్రీనగర్‌లో శుక్రవారం ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డుల్లో నిర్మించకుండా, అసంపూర్తిగా ఉన్న డ్రెయినేజీలు, రోడ్లను పరిశీలించారు. ఎమ్మెల్యే వైఫల్యం వల్లనే రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టడం లేదన్నారు. పట్టణ అధ్యక్షుడు వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, పట్టి వెంకటకృష్ణ, పానుగంటి మధు, తాజ్‌ఖాన్, జాడి సత్యనారాయణ, పల్లి రాకేశ్, అశోక్ ఉన్నారు.



శ్రీశ్రీనగర్‌లో డ్రెయినేజీని పరిశీలిస్తున్న రఘునాథ్

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం బుచ్చయ్యపల్లి పంచాయతీ పరిధి పెద్దదుబ్బలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జెడ్పీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, ఎంపీపీ శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యాన్ని విక్రయించాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. సర్పంచ్ మాధవి, మాజీ ఎంపీపీ సుభాష్‌రావు, నాయకులు రవి, శ్రీనివాస్, వెంకటేశ్, అశోక్, ఐకేపీ సీసీ రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: పొక్కూరులో డీసీఎంఎస్ ఆధ్వర్యాన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెల దామోదర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని అమ్ముకోవాలని సూచించారు. సర్పంచ్ కుక్కడపు నరేందర్, నాయకులు పాల్గొన్నారు.



బెల్లంపల్లిరూరల్: కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ సత్యనారాయణ

మైనార్టీ బాలికల గురుకులంలో ఉత్తమ ఫలితాలు

బెల్లంపల్లి: తెలంగాణ ప్రభుత్వ బెల్లంపల్లి బాలికల మైనార్టీ గురుకుల విద్యార్థులు పదో తరగతి , ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ఉత్తమంగా రాణించారని ప్రిన్సిపాల్ షబానా అన్సారీ తెలిపారు. విద్యార్థులు సాధించిన ఫలితాలను శుక్రవారం ఆమె ప్రకటించారు. టెన్త్‌లో బాలికలు వంద శాతం ఉత్తీర్ణత సాధించి రికార్డు సృష్టించారని తెలిపారు. డి.స్ఫూర్తి 9.7 జీపీఏ సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచారని తెలిపారు. జుబేద 9.5 జీపీఏ, అక్షిత 9.3 జీపీఏ, అంజుమ్ బేగం, రుచిత ,జున్నైర సభ 9.2 జీపీఏలతో మెరిశారని వెల్లడించారు. కళాశాల ఉత్తీర్ణత 96 శాతం నమోదైందని తెలిపారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో జి.హిమబిందు 1000 మార్కులకు గాను 963 సాధించి కళాశాల టాపర్‌గా నిలిచిందన్నారు. ఎన్.సిరి మైథిలి, జి.రోహిత 959 మార్కులు సాధించారని వివరించారు. బైపీసీ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఫసియా 972 మార్కులు సాధించగా, కె.దీప్తిలోచన 968 మార్కులు తెచ్చుకుని ఉన్నతంగా రాణించారన్నారు. ఎంపీసీ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో ఎ. వందన 463, బి.నిఖిత 442 మార్కులు సాధించారని పేర్కొన్నారు. బైపీసీ విభాగంలో డి.సరిత 418, షాదియత రుణం 416 మార్కులతో ప్రతిభ చాటుకున్నారని ప్రిన్సిపాల్ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ప్రిన్సిపాల్

10 మందిలో..ఒకే ఒక్కరు

కోటపల్లి: మల్లంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈసారి 10 మంది టెన్త్ పరీక్ష రాయగా..ఒకే ఒక్కరూ రాజేశ్వరి(6) జీపీఏ ఉత్తీర్ణత సాధించింది. నక్కలపల్లి, కొండంపేట గ్రామాల నుంచి విద్యార్థులు ఈ పాఠశాలలో విద్యనభ్యసిస్తుంటారు. రాష్ట్ర ప్రభుత్వం సర్కారు బడుల్లో నాణ్యమైన విద్యనందిస్తున్నప్పటికి మండలంలో టెన్త్ ఫలితాల్లో పూర్తిగా పడిపోయింది. మండలంలో గతంలో వందశాతం ఉత్తీర్ణత సాధించి ఘనత ఉండగా ప్రస్తుతం మల్లంపేట ప్రభుత్వ పాఠశాలలో ఒక్కరే పాస్ కావడం ఏంటని తల్లిదండ్రులు ఉపాధ్యాయులను ప్రశ్నిస్తున్నారు. తప్పు ఉపధ్యాయులు, విద్యార్థులదో తెలియదు కానీ..రిజల్ట్ మాత్రం పూర్తిగా పడిపోయింది. ఏదిఏమైనా ఫలితాలు సాధించడంలో సర్కారు బడులు వెనుకబడిపోయాయనడంతో సందేహం లేదని పలువురు అభిప్రాయపడ్డారు.

కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని ఆర్‌కే1ఏ గనిలో నెలకొన్న కార్మికుల సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అక్బర్‌అలీ డిమాండ్ చేశారు. శుక్రవారం గనిలో నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్మికుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డైరెక్టర్ బలరాం నాయక్ ఆదేశించినప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. ఆర్‌కే1ఏ గని మూసివేతకు సిద్ధంగా ఉన్న నేపథ్యంలో యాక్టింగ్ చేస్తున్న కార్మికులందరికీ ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. అలాగే క్వార్టర్లు లేని కార్మికులందరికీ 10 శాతం హెచ్‌ఆర్‌ఏ చెల్లించాలన్నారు. యూనియన్ ఫిట్ కార్యదర్శి సురమల్ల వినయ్, గోవిందుల రమేశ్, గట్టయ్య, రమేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అక్బర్‌అలీ

ఘనంగా నర్సుల దినోత్సవం



మంచిర్యాలటౌన్ ప్రభుత్వ ఆసుపత్రిలో కేక్ తినిపించుకుంటున్న నర్సులు



చెన్నూర్‌లో సీహెచ్‌సీలో కేక్ కట్ చేస్తున్న నర్సులు, వైద్యులు

మంచిర్యాలటౌన్: జిల్లా వ్యాప్తంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి, మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోని నర్సులను పలు స్వచ్ఛంద సంస్థలు సన్మానించాయి. ప్రభుత్వ ఆసుపత్రిలోని నర్సులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల సూపరింటెండెంట్ డాక్టర్ అరవింద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

- మంచిర్యాల మహిళా తరంగిణి సభ్యుల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి నర్సులను శాలువాతో సత్కరించారు. మమత అధ్యక్షురాలు శ్రీదేవి గౌడ్, కార్యదర్శి పద్మ రెడ్డి, కోశాధికారి జ్యోత్స్న, భాగ్యలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.
- మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోని నర్సులను రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు వి.మధుసూదన్‌రెడ్డి, మలబాదర్ గోల్డ్ మంచిర్యాల శాఖ మేనేజర్ రోషన్ లాల్‌లు కలిసి 12 మంది సీనియర్ నర్సులను సన్మానించారు. ఆర్ఎంవో డాక్టర్ భీష్మ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వేదవ్యాస్, భారతి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూర్: చెన్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో నర్సులు కేక్ కట్ చేశారు. ఆరోగ్య కేంద్ర సూపరింటెండెంట్ సత్యనారాయణ, నర్సులు, హిమబిందు, అరుణ, నాగమణి, ఏసు కరుణ పాల్గొన్నారు.



నర్సులను సన్మానిస్తున్న మమత సభ్యులు



తాండూర్: నర్సులను సన్మానిస్తున్న నిర్వాహకులు

తాండూర్: మండలంలో అభినవ స్వచ్ఛందసేవా సంస్థ ఆధ్వర్యంలో నర్సులు పద్మ, నవిత, స్రవంతి, పద్మలను సన్మానించి సేవలను కొనియాడారు. సభ్యులు సంతోష్‌కుమార్, మైలారపు అక్షయ, భాస్కర్, సత్యనారాయణ, సాహితీ, అనూష, శరణ్య తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో వీఆర్ఏల నిరసన

భీమిని: తమ సమస్యలు పరిష్కరించాలంటూ కన్నెపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీఆర్ఏలు నల్లబ్యాడ్జీలతో శుక్రవారం నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ రాంచందర్‌కు వినతిపత్రం అందజేశారు.



నిరసన తెలుపుతున్న వీఆర్ఏలు

పిచ్చికుక్కల దాడిలో మహిళకు గాయాలు

నెన్నెల: మండలంలోని ఖర్జీ – జంగాల్‌పేటకు చెందిన గొలుసుల పోసక్కపై శుక్రవారం పిచ్చికుక్క దాడి చేసి గాయపర్చింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను ఆటోలో నెన్నెల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ఇప్పటికే ఈ పిచ్చికుక్క ఆరుగురిపై దాడి చేసిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామాల్లో పిచ్చికుక్కలు స్వైరవిహారం చేయడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



గాయపడిన పోసక్క

విత్తనాల కొనుగోలు జాగ్రత్తలపై అవగాహన

కోటపల్లి: మండల కేంద్రంలోని రైతువేదికలో విత్తనాల కొనుగోలులో రైతులు పాటించాల్సిన జాగ్రత్తలపై ఏవో మహేందర్ శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ అధీకృత లైసెన్స్ డీలర్ నుంచే రసీదుతో విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. అయిల్‌పాం సాగు, పీఎం కిసాన్ పెండింగ్‌లో ఉన్న రైతులు ఈకేవైసీ బ్యాంక్ అకౌంట్ ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. ఏఈవో రాజుకుమార్, పీఏసీఎస్ సీఈవో రాజునాయక్, రైతు కోర్డినేటర్లు పాల్గొన్నారు.

అక్షరాస్యత, కుట్టు శిక్షణకేంద్రం సందర్శన

మంచిర్యాలఅర్బన్: స్థానిక అండాళమ్మ కాలనీ జిల్లా వయోజన విద్యాశాఖ, సఖిలైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అక్షరాస్యత, కుట్టు శిక్షణ కేంద్రాన్ని జిల్లా ఉపాధి కల్పనాశాఖ అధికారి వెంకటరమణ, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి వివేకవర్ధిని సందర్శించారు. కార్యక్రమంలో వయోజన విద్యాశాఖ అధికారి పురుషోత్తం నాయక్, డీఆర్పీలు వెంకటేశ్వర్లు, జనార్దన్, అశోక్‌రావు, శిక్షణ కేంద్ర ఇన్‌స్ట్రక్టర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్ | రోడ్డుపైనే మురుగునీరు

చెన్నూర్‌రూరల్: మండలంలోని బీరెల్లి గ్రామంలో సరైన డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగు నీరు రోడ్డుపైనే పారుతోంది. ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైన అధికారులు పట్టించుకుని చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

- అధికారి: అజ్మత్ అలీ, ఎంపీవో, సెల్: 90000 13494

